## వెంకన్న సేవలో విద్యాప్రసన్నతీర్థస్వామి



తిరుమల,జులై 8ప్రభాతవార్తప్రతినిధి:
కర్నాటక కుక్కే సుబ్రమణ్యమఠం పీఠాధిపతి విద్యాప్రసన్నతీర్థస్వామి సోమవారం ఉదయం శిష్యులతోకలసి వెంకన్నను దర్శించుకున్నారు. జెఈఓ వీరబ్రహ్మం స్వామివారికి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## సమస్యలకు సత్వర పరిష్కారం

### పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టంకు 194 అర్జీలు- కలెక్టర్

చిత్తూరు టౌన్, జులై 8 ప్రభాతవార్త:
ప్రజల నుండి పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టంకు అందిన సమస్యలను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టంకు హాజరై ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య, డ్వామా పిడి రాజశేఖర్‌లు హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు.



# బదిలీల కోసం నిరీక్షణ

### సొంత జిల్లాలకు వెళ్ళడంపైనే ధ్యాస - ఇక్కడ తూతూ మంత్రంగా అధికారులు విధుల నిర్వహణ

చిత్తూరు టౌన్, జులై 8 ప్రభాతవార్త:
సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కావస్తున్నప్పటికీ ఎన్నికల బదిలీల్లో భాగంగా జిల్లాలో విధులు నిర్వర్తించడానికి వచ్చిన అధికారులు బదిలీలు ఎప్పుడెప్పుడు జరుగుతాయా! తాము సొంత జిల్లాలకు ఎప్పుడు వెళ్ళిపోదామా! అనే ధ్యాసలో వున్నారు. ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు ఎన్నికల విధులు నిర్వర్తించడానికి ఇక్కడికి వచ్చిన అధికారులు బదిలీలపై ప్రభుత్వ ఉత్తర్వుల కోసం ప్రస్తుతం నిరీక్షిస్తున్నారు. మరోవైపు విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు కావస్తుండటంతో బదిలీలు త్వరగా జరిగితే ఇక్కడ చదువుతున్న పిల్లలను తమతో పాటు బదిలీ అయిన ప్రాంతాలకు తీసుకెళ్ళి అక్కడ పాఠశాలల్లో చేర్చడానికి అధికారులు, ఉద్యోగులు బదిలీల ఉత్తర్వుల కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు ఎన్నికల విధులు నిర్వర్తించడానికి ఈ జిల్లాకు చెందిన అధికారులను ఇతర జిల్లాలకు, అలాగే ఇతర జిల్లాకు చెందిన అధికారులను ఈ జిల్లాకు బదిలీ చేయడం అనవాయితీ. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం ఎన్నికల ముందు ఈ జిల్లా నుండి ఇతర జిల్లాకు బదిలీ చేసిన అధికారులు, ఇతర జిల్లాల నుండి ఈ జిల్లాకు బదిలీ అయిన అధికారులను మళ్ళీ వారి వారి జిల్లాలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం అనవాయితీ. అయితే రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కావస్తున్నప్పటికీ ప్రభుత్వం బదిలీలపై ప్రత్యేక శ్రద్ధ వహించలేదు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీల బదిలీలు మినహాయించి ఇప్పటి వరకు రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం జిల్లా స్థాయి అధికారుల బదిలీలు చేపట్టలేదు. జిల్లా స్థాయి అధికారుల బదిలీలు పూర్తి స్థాయిలో జరిగిన అనంతరం మాత్రమే ఎన్నికల విధులు నిర్వర్తించడానికి జిల్లాకు వచ్చిన అధికారుల బదిలీలు జరిగే అవకాశం వుంటుందని కొందరు భావిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణ పక్కాగా చేపట్టడానికి ఎలక్షన్ కమీషన్ ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగి వుండే ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తించే అధికారులను ఒక జిల్లా నుండి మరొక జిల్లాకు బదిలీ చేస్తోంది. ఈ మేరకు చిత్తూరు జిల్లాలో తహసిల్దార్లు, ఎంపిడిఓలు, ఎస్ఐలుగా ఎన్నికలకు ముందు విధులు నిర్వర్తించిన అధికారులు ఎన్నికల విధులు నిర్వర్తించడానికి ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్ళారు. ఇదే క్రమంలో ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు ఇతర జిల్లాల్లో తహసిల్దార్లు, ఎంపిడిఓలు, ఎస్ఐలుగా విధులు నిర్వర్తిస్తున్న అధికారులను చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో అధికారులపై ఎలక్షన్ కమీషన్ పర్యవేక్షణ ముగిసింది. రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం ఇతర జిల్లాల్లో ఇక్కడి నుండి విధులు నిర్వర్తించడానికి వెళ్ళిన తహసిల్దార్లు, ఎంపిడిఓలు, ఎస్ఐలను మన జిల్లాకు బదిలీ చేయాల్సి వుంది. అలాగే ఇక్కడికి ఎన్నికల విధులు నిర్వర్తించడానికి ఇతర జిల్లాల నుండి వచ్చిన తహసిల్దార్లు, ఎంపిడిఓలు, ఎస్ఐలను వారి వారి జిల్లాలకు బదిలీ చేయాల్సి వుంటుంది. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కావస్తున్నప్పటికీ అధికారుల బదిలీ అనే మాట వినపడని పరిస్థితి నెలకొంది. ఎన్నికల విధులు నిర్వర్తించడానికి ఇక్కడికి ఇతర జిల్లాల నుండి వచ్చిన తహసిల్దార్లు, ఎంపిడిఓలు, ఎస్ఐలు ప్రస్తుతం బదిలీ మూడ్‌లోకి వెళ్ళిపోయారు. అధికారులు బదిలీల మూడ్‌లోకి వెళ్ళిపోవడంతో వారు విధులు నిర్వర్తించే కార్యాలయాల్లో సమస్యలు పేరుకు పోతున్నాయి. మరోవైపు ఒక వేళ ప్రభుత్వం అధికారుల బదిలీలకు సై అంటే జిల్లాలోని అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ పరిధిలోని మండలాలకు తహసిల్దారు, ఎంపిడిఓ, ఎస్ఐగా ఎవరెవరిని నియమించుకోవాలనే విషయంపై ఇప్పటికే ఒక క్లారిటీకి వచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వెంటనే ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో తమకు అనుకూలంగా వుండే అధికారులను నియమించుకోవడం కోసం ఇప్పటికే సర్వం సిద్ధం చేసుకొన్నారు. ఈ మేరకు అధికారుల బదిలీలు ఎప్పుడు జరుగుతాయనే విషయంపై సర్వత్రా చర్చ జరుగుతుంది.

## కుప్పంలో ఎపియుఐఎఎంఎల్

# బృందం పర్యటన

### మోడల్ టౌన్‌గా అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌కై క్షేత్రస్థాయిలో పరిశీలన !!



కుప్పం పార్కును పరిశీలిస్తున్న బృందం

కుప్పం, జూలై 8 ప్రభాతవార్త
ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు సోమవారం కుప్పంలో ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్స్ మేనేజ్‌మె ంట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు పర్యటించారు. కుప్పం పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి మోడల్ టౌన్‌గా మార్చేందుకు గాను మాస్టర్ ప్లాన్ తయారీ, ప్రభుత్వానికి నివేదిక అందించేందుకోసం ఈ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసింది. త్రాగునీరు, రోడ్లు, స్మశాన వాటికలు, భూగర్భ డ్రైనేజ్, పబ్లిక్ టాయిలెట్లు, చెత్త సంపద సేకరణ, ఇరిగేషన్, గ్రంథాలయం, బస్టాండు, శిల్పారామం, పారిశ్రామిక వాడ, క్రీడలు, ఆలయాలు, రైల్వేస్టేషన్ల అభివృద్ధికి తీసు కోవాల్సిన చర్యలు, అందుకు అవసరమైన స్థలాలు, నిధులు తదితరాలపై ఎపియుఐఎఎంఎల్ బృందం డివిజనల్ హెడ్‌లు రాజేష్‌బాబు, కిరణ్, ఎఫ్‌హెచ్ ఇర్ఫాన్, కృష్ణచైతన్య, వాటర్ సప్లై ఇంజనీర్ దుర్గ రాజు, సాయి మనోజ్‌ల బృందం ఎమ్మెల్సీ, సమ న్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఇన్ చార్జ్ పిఎస్ మునిరత్నంలతో కలసి పట్టణంలోని పార్కు, రోడ్లు, డ్రైనేజీలను పరిశీలించారు. అనం తరం కుప్పం ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఈ బృం ద ం సమావేశమైంది. కుప్పం మున్సిపల్ పరిధిలో మౌలిక వసతులతో పాటు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై తగు ప్రణాళిక రూపొందించనున్నట్లు డివిజనల్ హెడ్‌లు రాజేష్‌బాబు,కిరణ్ తెలిపారు. ప్రభుత్వానికి డిపిఆర్ రూపంలో అందిస్తామని ప్ర భుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే కుప్పం లో అభివృద్ధి పనులు మొదలు పెట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమాల్లో చంద్ర బాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్,రాష్ట్ర నేత గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్ కుమార్, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, వేలు,జాకీర్, నేతలు సత్యేంద్రశేఖర్, మంజు,ప్రతాప్,ఫైరోజ్, సుబ్బు, బాలాజీ, బాలు, మహిళా నేతలు అనసూయ,

శిథిలావస్థలో దామలచెరువు రోడ్ బ్రిడ్జ్ 4లో
కాణిపాకం ఆలయానికి 1.32 కోట్లు ఆదాయం

## రుయాలో స్టాఫ్‌నర్స్‌పై రోగి దాడి





రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్టాఫ్ నర్సులు, నిరసన తెలుపుతున్న స్టాఫ్ నర్సులు

తిరుపతి హెల్త్, జులై 8, ప్రభాతవార్త
తిరుపతి రుయా ఆసుపత్రిలో పనిచేస్తున్న స్టాఫ్ నర్స్ ఏఎంసిలో విధులు నిర్వహిస్తున్న ఎస్. యశోదా పై హఠాతుగా దుర్గాప్రసాద్ అనే రోగి సెలైన్ స్టాండ్‌తో దాడి చేసిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఆమెకు తీవ్ర రక్తస్రావం జరిగి 10 కుట్లు వరకు పడింది. ఆమె రుయా ఉద్యోగి అయినా కూడా ఆమెకు సీనియర్ వైద్యులు సరైన వైద్యులు అందించకపోవడం గమనార్హం. ఈ దాడి వల్ల విధులు నిర్వహిస్తున్న వైద్య ఉద్యోగులందరూ భయాందోళనకు గురయ్యారు. విధి నిర్వహణలో ఉన్న వైద్య ఉద్యోగులకు సరైన భద్రత కల్పించడం లేదని నిరసన వ్యక్తం చేసారు. దాడి గురైన ఉద్యోగి కాంట్రాక్టు విధానంలో పనిచేయడం వల్ల వాళ్లకు వైద్య ఖర్చులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయ సహకారాలు అందవని వాపోయారు. స్టాఫ్ నర్స్ యశోదా విధి నిర్వహణలో ఉండగా గాయపడినందువలన ఆమెకు ప్రభుత్వ ఖర్చులతో మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేసారు. ఆమె పూర్తిగా కోలుకునే అంతవరకు ఆమెకు జీతభత్యములతో కూడిన సెలవులు మంజూరు చేయాలన్నారు. రోగి దుర్గా ప్రసాద్ పై పోలీసు కేసు నమోదు చేసి, ప్రభుత్వ రూల్స్ ప్రకారం అతని పై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ సంఘటనతో రుయాలో సెక్యూరిటీ, నాలుగవ తరగతి సిబ్బంది తక్కువగా ఉన్నందువలన, సిబ్బందిని మరింత మందిని పెంచితే ఇలాంటి సంఘటనలు పునరావృతం కావని కోరారు. రుయాలో జరిగిన సంఘటన పై విధి నిర్వహణలో ఉన్న వైద్య ఉద్యోగులకు సరైన భద్రత లేకపోవడం వారి కుటుంబానికి ఎటువంటి భరోసా లేదనిపిస్తుందని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని వైద్యశాఖలో శాశ్వత నియామకాలు మాత్రమే చేపట్టాలన్నారు.

## ప్రజల హృదయాల్లో చిరంజీవిగా ఉన్న వైఎస్ఆర్

### వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి



వెంకటగిరి, జులై 8, ప్రభాతవార్త
దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల హృదయాల్లో ఎన్నటికి చిరంజీవిగా ఉంటారని వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వైఎస్ఆర్ సిఎంగా ఉన్నప్పుడు పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. . రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ నక్క భానుప్రియ, వైస్ చైర్మన్ బాలయ్య, టౌన్ క్లబ్ అధ్యక్షులు లక్కమనేని కోటేశ్వర రావు, వైసిపి జిల్లా కార్యదర్శి హరికృష్ణ, పద్మశాలి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నక్క వెంకటేశ్వర రావు, కౌన్సిలర్లు కళ్యాణి పూజారి లక్ష్మి, శ్రీనివాసులు, గోపాల కృష్ణమూర్తి, నాయకులు నాగయ్య, కె. సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

చిత్తూరు టౌన్, జులై 8 ప్రభాతవార్త:
బైరెడ్డిపల్లి మండలంలో 2017 సంవత్సరంలో జరిగిన ఓ హత్య కేసుకు సంబంధించి నిందితుడు ఎం.శ్రీనివాసులు అలియాస్ శ్రీనప్పకు జీవిత ఖైదు విధిస్తూ 8వ అడిషనల్ జిల్లా జడ్జి శ్రీదేవి సోమవారం తీర్పు వెల్లడించారు. బైరెడ్డిపల్లి మండలం కుప్పనపల్లికి చెందిన బి.సీనప్పకు ఇద్దరు భార్యలు. బి.సీనప్ప రెండవ భార్య అయిన సుజా తమ్మతో ఎం.శ్రీనివాసులు అలియాస్ శీనప్పకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇది తెలిసిన సీనప్ప తన భార్య సుజాతమ్మను మందలించే వాడు. ఇది తెలుసుకున్న నిందితుడు శ్రీనివాసులు అలియాస్ శ్రీనప్ప ఎలాగైనా బి.సీనప్పను హత్య చేయాలని నిర్ణయించాడు. 2017 మే 16న బి.సీనప్ప ఒంటరిగా పంట పొలాలకు వెళ్ళాడని తెలుసుకున్న నిందితుడు ఎం.శ్రీనివాసులు అక్కడికి వెళ్ళి బి.సీనప్పతో గొడవ పెట్టుకుని ప్రక్కనే వున్న బైరవ స్వామి గుడి వద్దకు తీసుకెళ్ళి అతని గొంతుకు దారం బిగించి ఊపిరి ఆడనివ్వకుండా హత్య చేసి అక్కడి నుండి పారిపోయాడు. దీనిపై మృతి చెందిన సీనప్ప సోదరుడు వెంకటేశప్ప మే 17న బైరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి అప్పటి ఎస్ఐ కృష్ణ మోహన్ దర్యాప్తు ప్రారంభించారు. అప్పటి పలమనేరు రూరల్ ఇన్స్‌పెక్టర్ మధుసూధన్ రావును ఈ కేసు విచారణ అధికారిగా నియమించడంతో ఆయన అనుమానితులను విచారిస్తున్న సమయంలో నిందితుడు శ్రీనివాసులు అలియాస్ శ్రీనప్పను 2018 మార్చి 2న విచారించగా తానే ఈ హత్య చేశానని అంగీకరించడంతో పోలీసులు శ్రీనివాసులు అలియాస్ శ్రీనప్పను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఈ మేరకు కోర్టులో విచా రణకు వచ్చిన ఈ కేసు పూర్వ పరాలను విచారిం చిన 8వ అడిషనల్ జిల్లా కోర్టు జడ్జి శ్రీదేవి నింది తుడు శ్రీనివాసులు అలియాస్ శ్రీనప్పకు జీవిత ఖైదుతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

# హామీలు అమలు చేయడమే తమ లక్ష్యం

### జిల్లాలో పరిశ్రమలు,యూనివర్శిటి ఏర్పాటుకు కార్యచరణ చేస్తున్నాం : ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్ రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి,ఎమ్మెల్యే

పలమనేరు,జూలై 8,ప్రభాతవార్త:
ఎన్నికలలో ఇచ్చిన హామీల అమలు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎంపిదగ్గుమళ్ల ప్రసాద్ రావు పేర్కొన్నారు.ఎంపిగా బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారి స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఇప్పటికే ముఖ్యమంత్రితో సమీక్షించామన్నారు.జిల్లాలో చేపట్టవలసిన అభివృద్ధి పై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని తెలిపారు.ముఖ్యమంత్రి ఏ ఎంపిలను ఖళీగా పెట్టడం లేదని ప్రతి ఎంపి వారి ప్రాంతాలకు చేపట్టవలసిన అభివృద్ధి,కావలసిన పనులపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు.చిత్తూరు జిల్లాకు పరిశ్రమలు,యూనివర్శిటిలు,మామిడి పరిశ్రమల ఏర్పాటులకు జిల్లా కలెక్టర్‌తో సమీక్షించి వాటికి సంబందిచిన నివేదికలను త్వరలో ముఖ్యమంత్రికి అందజేస్తామన్నారు.పలమనేరు నియోజకవర్గంలో పలు పరిశ్రమల ఏర్పాటుకు కార్యచరణ చేస్తున్నామని,నియోజకవర్గంలో ఉపాధి కల్పన లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు.

**పరిశ్రమలకు నిలయం పలమనేరు: ఎమ్మెల్యే అమరనాథరెడ్డి**

పరిశ్రమలకు నిలయంగా పలమనేరును తీర్చిదిద్దుతామని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు.పలమనేరు నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు అందుతాయని, గతంలో టిడిపి ప్రభుత్వంలో గంగవరంలో పలు పరిశ్రమలకు అవకాశాల కల్పించడంతో నేడు ఆ ప్రంతంలో వేలాది మంది ఉపాధి పొందుతున్నారన్నారు.నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లెలో ఎక్స్‌ప్రస్ హైవే రింగురోడ్డు ఏర్పాటు కావడం జరుగుతుందని దీంతో పలమనేరు నుండి కర్నాటక రాష్ట్రం బెంగళూరు,తమిళనాడు రాష్ట్ర చెన్నై లకు అతితక్కువ సమయంలో ప్రయాణించవచ్చని తెలిపారు.దీంతో పలమనేరులో పరిశ్రమల ఏర్పాటుకు పలువురు ఆశక్తి చూపుతున్నాయని తెలిపారు.పలమనేరు నియోజకవర్గంలో పరిశ్రమలతో పాటు,ఆహార ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు ప్రయత్నాలు చేపడుతున్నామన్నారు.నియోజకవర్గంలో ఉపాధి కల్పనకు పరిశ్రమల ఏర్పాటు కీలకమని, ప్రపంచ దేశాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదర్శమని,ఆయనను చూపి ప్రపంచ దేశాల నుండి మన రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు సిద్దంగా ఉన్నారన్నారు.అధికారంలోకి వచ్చిన రెండు నెలలలోనే ప్రతి నియోజకవర్గంలో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేలతో సమీక్ష,జిల్లాలో చేపట్టవలసిన అభివృద్ధిపై ఎంపిలతో ముఖ్యమంత్రి సమీక్షలు చేస్తున్నారని తెలిపారు.గతంలో ఎమ్మెల్యేగా తాను తెచ్చిన నిధులను గత ప్రభుత్వం నిలుపుదల చేశారని ,వాటిని తిరిగి తీసుకురావడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులు పరిష్కరిస్తాం

### కమిషనర్ అధితి సింగ్



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న టిడిపి ఇన్చార్జి సుగుణమ్మ

తిరుపతి కార్పొరేషన్, జులై 8, ప్రభాతవార్త
తిరుపతి నగరంలో నెలకొన్న సమస్యలను, ప్రజల నుండి వస్తున్న అన్ని ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తామని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అతిధి సింగ్ అన్నారు. తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కమిషనర్ అధితి సింగ్ ప్రజల నుండి ఫిర్యాధులను, వినతులను స్వీకరించారు. తిరుపతి మాజీ శాసనసభ్యులు సుగుణమ్మ వినతి పత్రం ఇస్తూ తిరుపతిలోని 50 డివిజన్లలో వున్న సమస్యలను అదే విధంగా శెట్టిపల్లె సమస్యలను పరిష్కరించాలని కోవడంతో కమిషనర్ స్పందిస్తూ పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను, వినతులను కమిషనర్ స్వీకరిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, అధికారులతో చర్చించి, సమస్యలను పరిశీలించి త్వరగా ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమైన ఫిర్యాదుల్లో ఎంఆర్ పల్లి మున్సిపల్ పార్క్ వద్ద నాలుగు వీధి లైట్లు వెలగడం లేదని, ఉప్పరపాలెం హరిజనవాడ నందు తెలుగు గంగ లైన్ వేసినారని, కాని మెయిన్ లైన్‌కి కనెక్షన్ ఇవ్వలేదని, అదే విధంగా యుడిఎస్ లైన్ ఏర్పాటు చేయాలని, సుందరయ్య నగర్, సప్తగిరి నగర్, మధురా నగర్ ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వ వుందని ఇందిరా ప్రియదర్శిని మార్కెట్ పేరిట నగరమంతా వసూళ్ళు ఆపాలని, మహిళా యూనివర్శిటీ ముందర ఫుట్ పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయని, అదే విధంగా కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజి సమస్యలు పరిష్కరించాలనే ఫిర్యాదులపై కమిషనర్ అధితి సింగ్ స్పందిస్తూ తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామింరెడ్డి, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, కెఎల్ వర్మ, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అడిషనల్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, మేనేజర్ చిట్టిబాబు, డిఈలు, సూపర్డెంట్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ స్థాయికి ధీటుగా ప్రభుత్వ వైద్యం

### - ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



సూళ్లూరుపేట, జూలై 8 ప్రభాతవార్త
రాష్ట్రంలో కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యం అందించేందుకు అన్నిరకాల చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఇందులో భాగంగానే ప్రభుత్వాసుపత్రులు ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఆసుపత్రులకు మహర్దశ తీసుకురానున్నట్లు తెలిపారు. సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రిలో నూతనంగా నిర్మించిన భవనాలు ఇప్పటికే ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని, మరికొన్ని భవనాలు కూడా త్వరలో పూర్తయి అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని విజయశ్రీ డాక్టర్లకు చెప్పారు. అనంతరం ఆమె వృత్తిరీత్యా డాక్టర్ కావడంతో సెతస్కోప్‌ను చేతబట్టి కొందరు రోగులను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్, టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, మాధవనాయుడు, నెలవల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ భవనాన్ని పరిశీలించిన ఎంపి దగ్గుమళ్ల

– దళితుల సమస్యల పరిష్కారానికి హామీ !!

కుప్పం, జూలై 8 ప్రభాతవార్త



చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ల ప్రసాద్ రావు సోమవారం కుప్పంలోని డా॥ బిఆర్ అంబేద్కర్ భవనాన్ని పరిశీలించారు. భవనం గతకొంతకాలంగా నిరుపయోగంగా ఉండడంపై అడిగి తెలుసుకున్నారు. భవనం వినియోగంలో తెస్తామని పేర్కొన్నారు. అలాగే కడపల్లి వద్ద ఉన్న అంబేద్కర్ గురుకుల పాఠశాల దారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. అక్కడి రోడ్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రామకుప్పం, గుడుపల్లె, శాంతిపురంలలో అంబేద్కర్ భవనాల నిర్మాణం, శాంతిపురంలో అ ంబేద్కర్ విగ్రహ ప్రారంభంకు హామీ ఇచ్చారు. అలాగే దళితుల సమస్యల పరిష్కారంకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి నేతలు దేవరాజు మాదిగ, గోవిందప్ప, బాలచంద్రబాబు పాల్గొన్నారు.

## అర్హులైన మహిళలకు ప్రభుత్వ పథకాల్లో లబ్ది

కుప్పంరూరల్, జూలై 8 ప్రభాతవార్త

అర్హులైన మహిళలకు ప్రభుత్వ పథకాల్లో తప్పక లబ్ది కలుగుతుందని జిల్లా తెదేపా నేత రాజగోపాల్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రాగిమానుమిట్ట గ్రామంలో మహిళా సంఘాల విఒలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

## నకిలీ సదరమ్ సర్టిఫికేట్లతో ఉద్యోగాలు

– కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను జిల్లా చెవిటి వారి సంఘ అధ్యక్షుడు ఫిర్యాదు

చిత్తూరు టౌన్, జూలై 8 ప్రభాతవార్త:

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అనర్హులకు నకిలీ సదరమ్ సర్టిఫికేట్లు ఇవ్వడంతో అర్హులైన చెవిటి వారికి ఉద్యోగ అవకాశాలు రావడం లేదని, అనర్హులైన వారు నకిలీ సర్టిఫికేట్లతో ఉద్యోగాలు పొందుతున్నారని జిల్లా చెవిటి వారి సంఘ అధ్యక్షుడు ధనంజయులు, సభ్యులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లో జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టంకు హాజరైన ధనంజయులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందించి సదరమ్ సర్టిఫికేట్లు నకిలీలు మంజూరు చేస్తుండటంతో అర్హులైన తమ వంటి వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అర్హులై ప్రతి ఒక్కరికి పెన్షన్ మంజూరు చేయాలని, ఒకే కుటుంబంలో ఇద్దరు బధిరులుంటే వారిద్దరికి పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. అలాగే రామకుప్పం మండలం చిక్కపల్లి పంచాయతీ చెలిమిచేను తాండాకు చెందిన బి.రాధ తాను జనరల్ నర్సింగ్ మిడ్ వైఫరీ పూర్తి చేసి పిఇఎస్ మెడికల్ కళాశాలలో 2 సంవత్సరాలు పని చేశానని, కుప్పం కెజిబివి స్కూల్‌లో ఖాళీగా వున్న నర్సింగ్ పోస్టును ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే చిత్తూరు చామంతిపురంకు చెందిన కెంపమ్మ తనకు భర్త, పిల్లలు లేరని తాను నివసించడానికి ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్‌ను అభ్యర్థించారు.

## పేదల హృదయాల్లో చిరస్మరణీయుడు వైఎస్ఆర్

– మాజీ ఎమ్మెల్యే లలితకుమారి



**బంగారుపాళ్యం, జూలై 8 ప్రభాతవార్త:** పేదల హృదయాల్లో స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిరస్మరణీయుడిగా వున్నారని మాజీ ఎమ్మెల్యే లలితకుమారి అన్నారు. సోమవారం 75వ వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని వైకాపా నాయకులు కేక్‌లు కట్ చేసి ప్రజలకు పంచి పెట్టారు. కరిడివారిపల్లి వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి పూజ చేసి ఘన నివాళులు అర్పించారు. బంగారుపాళ్యం రాజా వీధిలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూజ నిర్వహించి పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మాజీ జడ్పీ చైర్మన్ కుమార్‌రాజా, జడ్పీటీసీ సోమశేఖర్, మండల వైకాపా కన్వీనర్ రామచంద్రారెడ్డి. వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, నాయకులు ప్రకాష్‌రెడ్డి, దత్తురెడ్డి, నాగరాజు, మహేంద్ర, కిషోర్‌కుమార్‌రెడ్డి, శరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ ఆదర్శప్రాయుడు

– మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం, జులై 8 ప్రభాతవార్త:

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతిని పురస్కరించుకుని సోమవారం కొత్తపల్లిమిట్టలో వైఎస్ఆర్ కంచు విగ్రహానికి డిప్యూటీ సిఎం నారాయణస్వామి పాలాభిషేకం చేశారు. స్థానిక సర్పంచ్ హరిత కుప్పయ్యతో కలిసి నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు గోవిందరెడ్డి, యేసురత్నం, జడ్పిటీసి రమణప్రసాద్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గురువారెడ్డి, శ్యాము, స్కెలా, చిరంజీవి, ధరణి, భరత్, భువనేష్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపి దగ్గుమళ్లకు ఘనస్వాగతం

శాంతిపురం, జులై 8 ప్రభాతవార్త

చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావుకు శాంతిపురంలో తెదేపా నేతలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. కుప్పం పర్యటనకు ఎంపి విచ్చేయగా మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు అధ్వర్యంలో నేతలు ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్‌కుమార్, నాగరాజు, రమేష్, రాజు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో వైఎస్సార్ జయంతి వేడుకలు

తవణంపల్లె, జూలై 8 ప్రభాతవార్త:



దివంగత సీఎం వైఎస్. రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలను సోమవారం మండల కేంద్రం తవణంపల్లె, అరగొండ, ఎగువ తడకర తదితర గ్రామాలలో ఈవేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు అరగొండ కొత్తబస్టాండులోని వైఎస్సార్ విగ్రహానికి స్థానిక వైకాపా నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే ఎగువ తడకర, తవణంపల్లె తదితర ప్రాంతాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు వైకాపా నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో వైకాపా మండల కన్వీనర్ సిద్దంపల్లె హరిరెడ్డి, ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ భారతి మధుకుమార్,, వైస్ ఎంపీపీ బాబురెడ్డి, అరగొండ కిషోర్‌కుమార్‌రెడ్డి, నాయకులు పార్థసారధిరెడ్డి, సందీప్‌రెడ్డి, గాంధీబాబు, పరమేశ్వరరెడ్డి, తవణంపల్లె మురుగ, ప్రశాంత్‌కుమార్‌లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఐరాలలో వైఎస్సార్ జయంతి వేడుకలు

ఐరాల, జూలై 8 ప్రభాతవార్త:



రాష్ట్ర మాజీ సీఎం దివంగత వైఎస్. రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలను సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈమేరకు మండల వైకాపా కన్వీనర్ బుజ్జిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్.గేట్ నందు వైఎస్సార్ జయంతి వేడుకలను నిర్వహించారు. పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైకాపా మం డల కన్వీనర్ బుజ్జిరెడ్డి, ఎంపీపీ చింతం మోహన్, మండల వైకాపా నాయకులు ఎర్రేపల్లె ప్రభాకర్‌రెడ్డి, చలపతిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, గణేష్ ప్రసాద్‌రెడ్డిలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల మదిలో మహానేత వైఎస్సార్

చౌడేపల్లి, జూలై 8 ప్రభాతవార్త



జనం మెచ్చిన నేత వైఎస్సార్ అని పలువురు నాయకులు కొనియాడారు. సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి సందర్భంగా స్థానిక బస్టాండులో గల ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. భారీ కేక్‌ను కట్ చేసి అందరికి పంచి పెట్టారు. హరీష్‌రాయల్, బోయకొండ ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు పవన్‌రాయల్, మాజీ మండలాధ్యక్షురాలు రుక్మిణమ్మ, మాజీ మండల ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, హెచ్‌డిఎస్ మాజీ చైర్మన్‌కళ్యాణ్‌భరత్, నాగభూషణంరెడ్డి, ఓబులేసు, వెంకట్రమణ, వైకాపానాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు

పాకాల, జులై 8, ప్రభాతవార్త



పాకాల ఆర్టీసి బస్టాండ్ వద్ద మాజీ తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన దివంగత నేత మన డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నేతలు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యతోనే ఆర్థిక అసమానతల తొలగింపు సాధ్యం

– ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, జూలై 8 ప్రభాతవార్త



సమాజంలో విద్యతోనే ఆర్థిక, సామాజిక అసమానతల తొలగింపు సాధ్యమని ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌పేర్కొన్నారు. సోమవారం స్థానిక బాలుర హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రభుత్వం తరపున విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. విద్యలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, వేలు, జాకీర్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, నేతలు మంజు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పేదల హృదయాల్లో వైఎస్ఆర్ చెరగని ముద్ర

– మున్సిపల్ చైర్మన్ డా॥ సుధీర్



కుప్పంరూరల్/ శాంతిపురం /రామకుప్పం, జూలై 8 ప్రభాతవార్త

సంక్షేమ పథకాలతో పేదల హృదయాల్లో దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చెరగని ముద్ర వేశారని కుప్పం మున్సిపల్ చైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. సోమవారం దివంగత వైఎస్ఆర్ 75వ జయంతి సందర్భంగా స్థానిక బస్టాండులో ఉన్న వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆంజనేయగుడి చైర్మన్ కుమరేష్ పాల్గొన్నారు. అలాగే వైఎస్ విగ్రహం వద్ద మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్ కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో ఎంపిపి అశ్విని, నేతలు పత్రాల మునిరత్నం, మోహన్‌రాం, జగన్, మణికంత, రమేష్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు. తంబిగానిపల్లి వద్ద ఐదో వార్డు ఇన్‌చార్జ్ సిపి మనోహర్ అధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అలాగే శాంతిపురంలో దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. వైఎస్ విగ్రహానికి ఈ సందర్భంగా పూజలు చేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జడ్పీటిసి శ్రీనివా సులు, నేతలు కోదండరెడ్డి, దండపాణి, ఎవి జయరాం, చెంగప్ప, చలపతి, రాజు, పట్టాభి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే రామకుప్పంలో దివంగత సిఎం వైఎస్ఆర్ జయంతిని వైకాపా నేతలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్ విగ్రహంకు నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పిం చారు. అనంతరం కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం, చంద్రారెడ్డి, చెంగారెడ్డి, పెను వేలుసింహ, నారాయణరెడ్డి, నారాయణస్వామి, యశ్వంత్‌రెడ్డి, గణేష్, మంజునాథ్, సుధాకర్ పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్సార్ జన్మదిన వేడుకలు

సదుం, జూలై 8 ప్రభాతవార్త



మండల పరిధిలోని సదుం, చెరకువారిపల్లె, బస్టాండులలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డిమండల పరిషత్ ఉపాధ్య క్షుడు ధనంజయరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి, మండల వైకాపా అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, రామచంద్రయ్య, మోహన్‌రెడ్డి, సర్పంచులు ఉషారాణి, శ్రీనివాసులురెడ్డి, నారాయ ణరెడ్డి, బోయకొండ ఆలయ మాజీ కమిటీ సభ్యుడు భాస్కరరెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ ఇందాద్, మాజీ సర్పంచి సయ్యద్‌భాషా, మైనారిటీ నాయకుడు ఖాజాపీర్, ఉపసర్పంచి మదనమోహనరెడ్డి, సీతాపతి , ధనశేఖరరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌ఐవీ పట్ల జాగ్రత్తగా ఉండాలి

యర్రావారిపాలెం, జూలై 8ప్రభాతవార్త

సమాజంలో ఒక మహమ్మారిగా ఉన్న హెచ్‌ఐవీ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని కోర్ స్వచ్ఛం దసంస్థ ప్రతినిధి సుమలత అన్నారు. సోమవారం యర్రావారిపాలెం మండలంలోని చింతగుంట, పసుపు లేటివారిపల్లె, కోటకాడహరిజనవాడలలో హెచ్‌ఐవీపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హెచ్‌ఐవీ అనే వ్యాధి అంటుకునేవ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అన్నారు. ఈవ్యాధి బారిన పడకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు చేపట్టాలో ఆమె వివరించారు. సంస్థ ప్రతినిధులు తులసి, హసీనా, విజయలక్ష్మిలు పాల్గొన్నారు.

## ఎన్నికల ఘర్షణల్లో నష్టపోయిన బాధితులకు డిప్యుటీ సిఎం చెక్కు పంపిణీ

శ్రీరంగరాజపురం, జులై 8 ప్రభాతవార్త:

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మండలంలోని పుల్లూరు పంచాయతీ పుల్లూరు గ్రామంలో అగ్రవర్ణాల దాడిలో గృహాలు కోల్పోయి గొడవల్లో నష్టపోయిన బాధితులకు వైకాపా అధిష్ఠానం బాధితులకు ఒక లక్ష రూపాయల చొప్పున మంజూరు చేసంది. ఈ మేరకు మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి సోమవారం బాధితులకు ఈ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ సిఎం మాట్లాడుతూ పుల్లూరు గ్రామంలో బాధ్యులైన మురళి, కరుణాకరన్, గిరి, గౌతమి, మోసెస్‌లకు లక్ష రూపాయలు చొప్పున విజయవాడ వైకాపా పార్టీ కార్యాలయం నుండి అందించారని ఈ మేరకు తాను బాధితులకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ హరిత కుప్పయ్య, జడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, నాయకులు జనార్ధన్, గురువారెడ్డి, మణి, భూపతిరెడ్డి, చిట్టి, మహేష్, కోటిరెడ్డి, దామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పేదల పాలిటి దైవం వైఎస్ రాజశేఖర్ రెడ్డి

మండల పార్టీ అధ్యక్షుడు వేందోటి కార్తీక్ రెడ్డి

బాలాయపల్లి, జులై 8, ప్రభాతవార్త



మండల కేంద్రమైన బాలాయపల్లిలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి మండల పార్టీ అధ్యక్షులు వెందోటి కార్తీక్ రెడ్డి, మాజీ డిసిసిబి సభ్యులు వెందోటి మధుసూధన్ రెడ్డి, వైసిపి నేతలు వెంకటరమణ రెడ్డి, అభిమానులు ఘన నివాళులు అర్పించారు. వైఎస్ఆర్ వేడుకల్లో వైసిపి నేతలు గుండెబోయిన గోపాల్ యాదవ్, గుర్రం రామ్మూర్తి, వేమూరు వెంకటరమణ ంరెడ్డి, టి. రామయ్య, కె. శ్రీరాములు, కె. నీలకంఠం, సర్వేపల్లి సురేష్, అమావాస్య సురేష్ రెడ్డి, వెందోటి హరికృష్ణ రెడ్డి, వాన పార్వతి, వైసిపి అభిమానులు పాల్గొన్నారు.

## ఏపీఆర్జేసీలో అతిథి పద్ధతిపై ఫిజికల్ డైరెక్టర్ నియామకం

వెంకటగిరి, జులై 8, ప్రభాతవార్త

ఏపీఆర్జేసీ (బాలురు)లో గెస్ట్ ఫ్యాకల్టీ పద్ధతిలో ఫిజికల్ డైరెక్టర్ నియమాకానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శారద బాయ్ చౌదరి తెలిపారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం నాలుగు గంటల లోపల కళాశాలలో ఎంపీ ఈడి చదివిన వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలు కోసం 8712625075 సెల్ నెంబర్‌కి సంప్రదించాలని ఆమె కోరారు.

## విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

చిల్లకూరు, జులై 8, ప్రభాతవార్త



చిల్లకూరు మండలం చేడిమాల గ్రామంలోని మెయిన్ స్కూల్, గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాల అలాగే నల్లయ్యగారిపాలెంలో ఉన్న పాఠశాలల విద్యార్థులకు రాజనేని రామానా యుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం లాగే ఈ నూతన విద్యా సంవత్స రంలో కూడా నోట్ బుక్స్, విద్యా సామాగ్రిని ట్రస్ట్ అధినేత శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యం లో అధ్యక్షులు పిచ్చయ్య నాయుడు చేతుల మీదుగా పిల్లలకు అందజేశారు.. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు. ట్రస్ట్ ప్రతినిధులు బాబు, భాస్కర్, వెంకటేశ్వర్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మరపురాని మహానేత డాక్టర్ వైఎస్ఆర్

గూడూరు జులై 8, ప్రభాతవార్త



దివంగత రాజశేఖర్ రెడ్డి ఆశయాలు నెరవేర్చుతూ వైసిపి శ్రేణులు ఆయన చూపిన మార్గంలో నడుస్తారని ఎమ్మెల్సీ మేరీగ మురళీధర్ తెలిపారు. గూడూరు పట్టణంలోని దివంగత నేత రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గూడూరు పట్టణంలోని సాహెబ్ పేట ప్రాంతంలో ఉన్న రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్సీ మురళీధర్ వైసిపి నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, చేవూరు విజయ మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సేవలు స్ఫూర్తిదాయకం

చిట్టమూరు, జులై 8 ప్రభాతవార్త



దివంగత జననేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు స్ఫూర్తిదాయకమని మండల వైసీపీ కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. సోమవారం వైఎస్సార్ 75వ జయంతి సందర్భంగా మండల కూడలిప్రాంతమైన కొత్తగుంటలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్ర మంలోమండలవైసీపీనాయకులు పాల్గొన్నారు.

## భూమికి హద్దులు చూపండి

– డిప్యూటీ తహశీల్దార్ యాకసిరివాసి వినతి

చిట్టమూరు, జూలై 8 ప్రభాతవార్త

తన తండ్రి పేరు మీద ఉన్న పట్టా పొలానికి హద్దులు చూపాలని యాకసిరి గ్రామానికి చెందిన సాలాపక్షి నారాయణ సోమవారం డిప్యూటీ తహశీల్దార్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఎన్నో సంవత్సరాలుగా తన తండ్రి పేరు మీద సర్వే నంబర్ 300/13లో ఉన్న ఎకరం పట్టా భూమిని సాగు చేసుకుంటున్నామని, అయితే తన భూమిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అతని భూమిలో కలిపేసుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలియజేశారు. అధికారులు తమ పట్టా భూమికి హద్దులు చూపించి ఆదుకోవాలని వారు విన్నవించారు.

## రక్తదాతలకు అభినందనలు

సూళ్లూరుపేట, జూలై 8 ప్రభాతవార్త



ఇటీవల చెన్నై అపోలో ఆసుపత్రిలో సూళ్లూరుపేటకు చెందిన ఒక ప్రభుత్వ ఉద్యోగి అత్యవసరంగా గుండె శస్త్రచికిత్సకు వెళ్లారు. ఈ నేపథ్యంలో హార్ట్ సర్జరీ చేసే నిమిత్తం రక్తం అవసరమైంది. దీంతో సూళ్లూరుపేటకు చెందిన రక్తదాతలు ముకేష్ జైన్, సతీష్, గోపిరెడ్డి, సుందరరామమూర్తిలు తక్షణమే చెన్నై అపోలో ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశారు. సూళ్లూరుపేటకు చెందిన ఈ నలుగురు రక్తదానం చేయడం పట్ల సూళ్లూరుపేట సేవాసమాఖ్య, రెడ్‌క్రాస్ బృందం వారు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా వీరికి రెడ్‌క్రాస్ తరపున ఉస్మాన్‌బాషా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

## తడలో వైఎస్సార్ విగ్రహానికి నివాళి

తడ, జులై 8 ప్రభాతవార్త



తడ మండలం తడకండ్రిగ పంచాయతీ పరిధిలోని బోడిలింగాలపాడు వద్ద సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మం డల వైసీపీ అధ్యక్షుడు, తడ సర్పంచ్ కె.ఆర్ముగం ఆధ్వర్యంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. అయితే వైసీపీ అధికారం కోల్పోయిన తర్వాత మండలంలోని కొంతమంది ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరు కాకపోవడం విశేషం. బోడిలింగాలపాడు సర్కిల్‌లో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రికి వెళ్లి రోగులకు పండ్లు, బిస్కెట్లు పంచిపెట్టారు.

## నేటి నుంచి వ్యవసాయశాఖచే పీఎం కిసాన్‌పై పరిష్కార వేదిక

తడ, జులై 8 ప్రభాతవార్త

రైతు కుటుంబాలకు కేంద్రప్రభుత్వం ద్వారా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పిఎం కిసాన్) అందిస్తున్న నేపథ్యంలో వీటి సమస్యల నివారణకు మంగళవారం నుంచి ప్రత్యేక పరిష్కార వేదిక ఏర్పాటు చేసినట్లు సూళ్లూరుపేట వ్యవసాయ శాఖ ఏడీ జి.అనిత పేర్కొన్నారు. సూళ్లూరుపేట పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల రైతులు ఈ పథకం అందకుండా ఉంటే ఈ వేదికలో పరిష్కరించుకోవాలని ఆమె సూచించారు.

## ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన ఏడిఏ

వెంకటగిరి, జులై 8, ప్రభాతవార్త

పట్టణంలోనే పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎం. నాగార్జున సాగర్, ఏవో సుజాతాలు ఆకస్మిక తనిఖీ చేశారు. గోకుల్ కృష్ణ ట్రేడర్స్, వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్ షాపులకు సంబంధించి 2 లక్షల 79 వేల రూపాయిల విలువ కలిగిన 12.8 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలను నిలుపుదల చేసినట్లు ఏడిఏ నాగార్జున సాగర్ తెలిపారు. డీలర్లు అందరూ ఫామ్ ఓ తప్పనిసరిగా నమోదు పరచాలని తెలిపారు.

## సకాలంలో వినతులను పరిష్కరించండి

గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

గూడూరు, జులై 8, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో గూడూరు పట్టణ, రూరల్ చిల్లకూరు మండలాల పరిధిలోని అన్ని శాఖల అధికారులతో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిశీలించి త్వరతగతిన వారి సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. అదే విధంగా మండలాలలో త్రాగునీటి సమస్య, కరెంట్ సమస్యలను గుర్తించి అధికారులు ప్రపోజల్స్ తయారు చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డిఓ కిరణ్ కుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త తానంకి నానాజీ, సీనియర్ నాయకులు చాంద్ భాషా, మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, పులిమి శ్రీనివాసులు, కొండూరు వెంకటేశ్వర రాజు, పలు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

కోట, జులై 8 ప్రభాతవార్త



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతిని కోట క్రాస్‌రోడ్డులో సోమవారం వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. క్రాస్‌రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైసీపీ జాయింట్ సెక్రటరీ నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేసి పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. 1 కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ నరమాల వెంకటరమణయ్య, పుచ్చలపల్లి జలసంఘం మాజీ అధ్యక్షుడు దువ్వూరు వెంకటరమణారెడ్డి, సిద్ధవరం సొసైటీ మాజీ ఛైర్మన్ పాదర్తి రాధాకృష్ణారెడ్డి, మొబిన్‌బాషా, నాగూర్‌రెడ్డి, కస్తూరయ్య, సుధారెడ్డి, సురేంద్రరెడ్డి, పల్లిముల్లు విజయసారధిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కోటలో విద్యార్థుల ర్యాలీ

కోట, జులై 8 ప్రభాతవార్త



కోట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు నేను బడికి పోతా అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఓ మస్తానయ్య మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. బడి మధ్యలో మానేసిన వారు వెంటనే ఆయా గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో చేరాలని సూచించారు. పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రి, దుస్తులు, బూట్లు, పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం వంటి ఎన్నో వసతులు ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు.

## సూళ్లూరుపేటలో వైఎస్సార్‌కు ఘన నివాళి

సూళ్లూరుపేట, జులై 8 ప్రభాతవార్త



సూళ్లూరుపేట పట్టణంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని సోమవారం ఆర్టీసీ బస్టాండు వద్దగల వైఎస్సార్ విగ్రహానికి ఎంపిపి అల్లూరు అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు జెట్టి వేణు యాదవ్, సిహెచ్ సుబ్రహ్మణ్యంరెడ్డి, పోలూరు పద్మ, మీజూరు రామకృష్ణారెడ్డి, చిన్నిసత్యనారాయణ, అయితా శ్రీధర్, బాబురెడ్డి, కాకి శ్రీరామమూర్తి, భగవాన్‌దాస్, బందిలి మహేష్, పేర్నాటి లక్ష్మీదేవి, చిలకా యుగంధర్, బద్దెపూడి మోహన్‌రెడ్డి, అల్లూరు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు

శ్రీకాళహస్తి రూరల్ జూలై 8 ప్రభాతవార్త

వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75 వ జయంతి వేడుకలను శ్రీకాళహస్తి మండలం వాంపల్లిలో మండల నాయకులు కలవగుంట.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో చెంచయ్యనాయుడు, నాగరాజురెడ్డి, వెంకట్‌రెడ్డి, హరిబాబు,భూషణం యాదవ్,పోలి.గుణ,నరేష్,తిరుపాల్‌నాయుడు, ఈశరయ్యలు పాల్గొన్నారు.

## కొందరామేశ్వరుని దర్శించుకున్న రిషితారెడ్డి

శ్రీకాళహస్తి రూరల్ జూలై 8 ప్రభాతవార్త

మండలంలోని బొక్కిసంపాళెం గ్రామంలో వెలిసిన శ్రీకాళహస్తి అనుబంధమైన కొండదరామేశ్వరాస్వామి ఆలయాన్ని బొజ్జల రిషితారెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ఆమె గ్రామస్థులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్లమెంటు అధికార ప్రతినిధి రంగినేని చెంచయ్యనాయుడు,మండల పార్టీ అధ్యక్షుడు కామేష్‌యాదవ్,పార్టీ సీనియర్ నాయకుడు బొల్లినేని జగన్నాధం నాయుడు నాయకులు బత్తిరెడ్డి,జగదీశ్వర్‌రెడ్డి,మోదుగుల రవి తదితరులు పాల్గొన్నారు.

## మూడనమ్మకాలతో వలసలు

.తొట్టంబేడు, జూలై 8 ప్రభాతవార్త



మండలంలోని గుండేలిగుంట పంచాయతీ పరిధిలోని అల్లూరిసీతారామరాజు ఎస్టీ కాలనీ లో సుమారు 40 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా గ్రామదేవతగా పూజిస్తున్న వేపచెట్టు ఎండిపోయింది. దీనికి తోడు గత నెలలో ఎండలు ఎక్కువగా ఉన్నందున డీహైడ్రేషన్ వచ్చి కొంతమంది అస్వస్తతకు గురికావడం అలుసుగా తీసుకుని కొంతమంది వారి అజ్ఞానాన్ని అవకాశంగా చేసుకుని మూడనమ్మకాలతో గ్రామదేవత దెయ్యంగా మారిందని చెప్పి కాలనీలో ఉన్న కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల దృష్టికి రావడంతో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మండల ఉపాధ్యక్షుడు మరియు సదరు పాఠశాల గణిత సహాయకులు కె.మునీశ్వరరెడ్డి, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు చెంచయ్య, జనవిజ్ఞానవేదిక సభ్యులు మరియు జీవశాస్త్ర సహాయకులు మస్తాన్‌రావులు పాల్గొని గ్రామస్తులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.నేటి కంప్యూటర్ యుగంలో కూడా మూడనమ్మకాలు నమ్మవద్దని హితవు పలికారు.కాలనీలో ఎండిపోయిన చెట్టు వద్ద మరో చెట్టును నాటడానికి వారిని సమాయత్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాలప్రధానోపాధ్యాయులు, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించండి

తొట్టంబేడు, జూలై 8 ప్రభాతవార్త



గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు గాలిమురళీ నాయుడు అన్నారు. నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని పెద్దకనపర్తి గ్రామ పంచాయతీ సచివాలయాన్ని కార్యదర్శి మాధురి ఆహ్వానం మేరకు జరిగిన గ్రామసభకు హజరయ్యారు. ప్రజలు పలు సమస్యలను అధికారులు, నాయకులు దృష్టికి తీసుకురాగా సమస్యలన్నింటినీ పరిష్కరించాలని మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు పంచాయతీ కార్యదర్శి మరియు సచివాలయ సిబ్బందిని కోరారు. ప్రస్తుతం దయేరియా ప్రబలుతోందని పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చలపతి, రఘురామయ్య, శేఖర్, బత్తెమ్మ, రమాదేవి, వెంకటరాయులు, సుబ్బాచారి, విమలమ్మ, సుబ్రమణ్యం, కస్తూరయ్య, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు

శ్రీకాళహస్తి, జూలై 8 ప్రభాతవార్త



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డిఎల్‌పిటిటి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి ఆదేశాల మేరకు కిరణ్‌కుమార్ డిప్యుటీ డెమో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కుష్ఠువ్యాధి, క్షయ, మరియు ఇతర సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శరీరంగా స్పర్శలేని మచ్చలు, పొడలు లావుగా మారిన నొప్పితో కూడిన నరాలు, బొడిపెలు నొప్పిలేని పుండ్లు, చెవితమ్మెలు మందంగా ఉండడం ముఖంపై నూనె రాసినట్లు జిడ్డుగా నిగనిగలాడే చర్మం ఉండడం తదితర లక్షణాలు ఉండినట్లయితే కుష్ఠువ్యాధి లక్షణాలుగా అనుమానించాలని వ్యాధి నిర్ధారణ కోసం దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల్ని సంప్రదించాలని తెలిపారు. కలుషిత నీటి వల్ల డయేరియా వచ్చే అవకాశం ఉందని కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. నీరు నిల్వఉన్న కాలువలను వెంటనే శుభ్రం చేయించి డెంగీ, మలేరియా వ్యాధులు రాకుండా చూడాలన్నారు.ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శివకుమార్‌రెడ్డి, డాక్టర్ స్రవంతి, వైద్యాధికారులతో పాటు ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, శైలజ పిహెచ్ఎన్ గౌరీ, తేజ, ఎంఎల్‌హెచ్‌సిధనలక్ష్మి,ఎఎన్ఎంఇతరఉపాధ్యాయులు,విద్యార్థినీవిద్యార్థులు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## శిరస్త్రాణం ధరించడం శ్రేయస్కరం

శ్రీకాళహస్తి, జూలై 8 ప్రభాతవార్త

పట్టణంలోని ఆర్టీసి బస్టాండు వద్ద సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలోహెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు, ధరించకపోతే ఎలాంటి ప్రమాదాలు చేకూరుతాయో న్యాయవాది రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలన్నారు.వాహనాలు నడిపేటపుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లేకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

## విలువలతో కూడిన విద్యను అందించండి..రిషితారెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 8 ప్రభాతవార్త

విలువలతో కూడిన విద్యను అందించాలని ఎంఎల్ఏ వెంకటసుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జలరిషితారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని భరద్వాజతీర్థం లోబావి సమీపంలో ఉన్న గిరిజన పాఠశాల విద్యార్థులకు పలకలు, పెన్నులు, ఇతర విద్యాసామగ్రిని పంపిణీచేశారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు, మార్కెట్‌కమిటీ మాజీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, ప్రధానోపాధ్యాయురాలు ఎం.విజయ, ఉపాధ్యాయురాలు విజయ పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## దివంగత నేత రాజశేఖర్‌రెడ్డికి ఘననివాళులు

శ్రీకాళహస్తి, జూలై 8 ప్రభాతవార్త



కాంగ్రెస్‌పార్టీ ఉన్నతాధికారులు ఇచ్చిన పిలుపు మేరకు దివంగతనేత డాక్టర్ వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి 75వ జన్మదిన వేడుకలను మూడు రోజుల పాటు జరపాలని నిర్ణయించడంతో పార్టీ కార్యాలయంలో డాక్టర్ ఎస్.బత్తెయ్యనాయుడు ఆధ్వర్యంలో రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి కేక్‌కట్ చేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎం.వెంకటమునిని, వీరరాఘవరెడ్డి, ఇర్లగోపి, శెట్టిపల్లి శివయ్య, ఎస్.నాగూరయ్య, బత్తెయ్య, నరసింహులు, సురేష్, వానమ్మ, భానమ్మ, మస్తానమ్మ, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు

పుత్తూరురూరల్, జూలై 8 ప్రభాతవార్త:



వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలు సోమవారం పుత్తూరులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. పట్టణ పరిధిలోని పున్నమి సర్కిల్ వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ మంత్రి రోజా సోదరుడు కుమార స్వామిరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పుత్తూరు అంబేద్కర్‌సర్కిల్ వద్ద అన్నదాన కార్యక్రమం కూడా చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ హరి, వైస్ ఛైర్మన్‌లు జయప్రకాష్(చిట్టి), శంకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, కె.టి.ప్రసాద్, మనోహర్‌రెడ్డి, వైసీపీ నాయకులు భాస్కర్ యాదవ్, నరసింహులు, నారాయణరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, బత్తయ్య, కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్టీ కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తాం

సత్యవేడు, జూలై 8 ప్రభాతవార్త:



జనసేన పార్టీ కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని మండల అధ్యక్షుడు రూపేష్ తెలిపారు. జనసేన పార్టీ కార్యాలయంలో మండల కమిటీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల నాయకులు పార్టీని బలపరచండి 2029లో సత్యవేడు నియోజకవర్గంలో జనసేన పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిని నిలబెట్టి గెలిపించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా మదనంబేడు, పెద్ద ఈటిపాకం, రాసపాళెం పంచాయతీకి చెందిన కొంత మంది పార్టీ సిద్ధాంతాలు నచ్చి జనసేన పార్టీలో చేరారు. సమావేశంలో ఉపాధ్యక్షులు హేమంత్, ప్రధాన కార్యదర్శి డి.వి.ఎస్.విజయకుమార్, జ్యోతిశ్వర్, మునిశేఖర్, కుమార్, ప్రసన్నకుమార్, కార్యదర్శి వెంకయ్య, అనిల్‌కుమార్, సంయుక్త కార్యదర్శి జ్యోతి కుమార్, ధనుష్, పవన్‌కుమార్, జనసేన నాయకుడు లీలా ప్రసాద్ తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

డాక్టర్ ఉమాదేవి

తిరుపతి విద్య, జూలై 8, ప్రభాతవార్త



మహిళలు తమ రక్షణ కొరకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉమెన్స్ స్టడీ సెంటర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉమాదేవి అన్నారు. సోమవారం తిరుపతి రూరల్ చెర్లోపల్లి గ్రామ పంచాయితీలో సంఘ సభ్యులకు మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాదేవి మాట్లాడుతూ మారుతున్న కాలంతో పాటు మోసాలు, నేరాలు, హింసలు కూడా పెరుగుతున్నాయని, మహిళలకు ఈ నేరాల పై సరియైన అవగాహన లేక చాలా మంది బాధితులుగా మారుతున్నారని అన్నారు.సిసి సురేష్ రెడ్డి, సంఘ మిత్ర, మహిళా అధ్యయనకేంద్రరీసెర్చ్‌అసిస్టెంట్‌డాక్టర్ ఎం. ఇంద్రాణి, స్వయం సహాయక సంఘ మహిళలు పాల్గొన్నారు.

## నింద్రలో వైఎస్ఆర్ జయంతి వేడుకలు

నింద్ర,జూలై 08 ప్రభాతవార్త :



పేదల పాలిటి ఆశాజ్యోతి వైయస్ రాజశేఖర్‌రెడ్డి అని నింద్ర యంపిపి దీపా జలంధర్‌రాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి మండల సచివాలయ అధ్యక్షులు బాబురెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు వేణురాజు ఆధ్వర్యంలో జరిగింది. మండల కేంద్రంలో 200 మందికి అన్నాదానం చేసి కేక్ కట్ చేసారు.ఈకార్యక్రమంలో యంటిసి విజేష్,కో ఆప్షన్ మెంబరు అనిల్,నాయకులు మునిక్రిష్ణారెడ్డి,శివలింగంఆచ్చారి,మేరీజయరామ్,మహేష్,సెల్వం,సంపత్,నామదేవరెడ్డి,చార్లీ, ,బసవయ్య, బాలాజీ,సత్యరాజ్,తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అమరుడు

రేణిగుంట, జూలై 8 ప్రభాతవార్త:



ఉభయ తెలుగు రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణం లేని మహా నాయకుడు అని రాష్ట్ర ప్రజల గుండెల్లో ఆయన ఎప్పుడు అమరుడిగా నిలిచిపోతారని రేణిగుంట వైసీపీ నేతలు ముక్తకంఠంతో అన్నారు. వైఎస్ఆర్ 75వ జయంతిని పురస్కరించుకుని సోమవారం రేణిగుంట నందలి వైఎస్ఆర్ విగ్రహానికి మండల, పట్టణ వైసీపీ నేతలు పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ సంధ్యారాణి, కో-ఆప్షన్ సభ్యులు అసన్, మండల వైసీపీ అధ్యక్షుడు డా. గంగారి రమేష్, యోగీశ్వర్‌రెడ్డి, వైసీపీ యువ నేత పేరూరి పురుషోత్తంరెడ్డి, రేణిగుంట వైసీపీ ముస్లిం మైనారిటీ నాయకులు షబ్బీర్ అహ్మద్, మాజీ కో-ఆప్షన్ మెంబరు రఫీ ఉల్లా, షఫీ ఉల్లా, ఇరానీ ఖాదిర్, జాన్ బాబు, రాజేంద్ర, గురవరాజుపల్లి, రహీం, శంకర్‌రెడ్డి, బుజ్జమ్మ, పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## అంటు రోగాల పట్ల అప్రమత్తంగా ఉండండి

రేణిగుంట, జూలై 8 ప్రభాతవార్త:



అంటు రోగాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు ప్రజలకు పిలుపునిచ్చారు. ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా. చత్ర ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం రేణిగుంట పట్టణంలోని అనేక వీధుల్లో హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు తమ సిబ్బందితో పర్యటించి అంటు రోగాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా కలుషితమైనీ నీరు తాగకుండా నీటిని మరగ కాచుకుని చల్లార్చి తాగాలన్నారు. తద్వారా దయేరియా రాకుండా నివారించవచ్చన్నారు. ఆశ కార్యకర్తలు కల్యాణి, విమల, శాంతకుమారి పాల్గొన్నారు.

## రోడ్లు ఇలా ఉంటే ఎలా సారు....

రేణిగుంట, జూలై 8 ప్రభాతవార్త:



రోడ్లు ఇలా ఉంటే పిల్లలు నడిచేది ఎలా సారు అంటూ జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. రేణిగుంట ఉన్నత పాఠశాల నుంచి బీసీ బాలుర హాస్టల్ వరకు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో గుంతల్లో వర్షపునీరు నిలిచి విద్యార్థులు నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జన విజ్ఞాన వేదిక కార్యదర్శి కుప్పస్వామి, విద్యా వికాస వేదిక కన్వీనర్ ఓబీ రమణ ఆవేదన వ్యక్తం చేస్తూ సోమవారం విద్యార్థులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయని, నాలుగు సంవత్సరాలుగా ఎంత మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మార్గంలో తహసీల్దార్ కార్యాలయం, రెండు కాలనీలు, బీసీ హాస్టల్‌కు వెళ్లే వాళ్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బీసీ హాస్టల్‌లో ఆర్‌వో వాటర్ ప్లాంటును తక్షణం మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు సమర్పించారు.

## అన్నదానం చేసిన లక్ష్మిపతిరెడ్డి

రేణిగుంట, జూలై 8 ప్రభాతవార్త



మహానేత మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా వేమాపురం సంజీవరెడ్డి మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు డా. లక్ష్మిపతిరెడ్డి శ్రీ లక్ష్మినరసింహ ట్రస్టు సోమవారం నిర్వహించిన మధ్యాహ్నం భోజన కార్యక్రమంలో పాల్గొని మానసిక వికలాంగులకు భోజనం వడ్డించారు. లక్ష్మిపతి రెడ్డి ట్రస్టు నిర్వాహకురాలు సైదమ్మను అభినందిస్తూ ట్రస్టు కోసం తన స్వీయ వెల్ఫేర్ సొఇటీ ద్వారా సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

## విగ్రహాలు ధ్వంసం చేస్తే ప్రజల గుండెల్లోంచి తొలగించగలరా?

బియ్యపు మధుసూధనరెడ్డి

శ్రీకాళహస్తి,జూలై 8 ప్రభాతవార్త



వైయస్ఆర్ విగ్రహాల చేతులు,కాళ్ళు ధ్వంసం చేసినంత సులభంగా ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్న డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి రూపాన్ని చెరపగలరా? అని మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ప్రశ్నించారు. డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జన్మదిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిధిగా వచ్చారు.ఈ సందర్భంగా మధుసూధనరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి తన చివరి శ్వాస వరకు ప్రజల కోసమే పాటు పడ్డారన్నారు. చివరి ఊపిరి కూడా చిత్తూరుజిల్లా పర్యటనలోనే విడిచారన్నారు. శ్రీకాళహస్తిలో డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జన్మదిన సందర్భంగా సర్కిల్‌ను పూల ముస్తాబులతో కళ్ళను ఆకట్టుకునే రీతిలో ముస్తాబు చేసారు. కార్యక్రమాల్లో మాజీ శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, తొట్టంబేడు నాయకులు ఉన్నం వాసుదేవనాయుడు, కన్నలి ప్రభాకర్‌రెడ్డి,మాజీ మార్కెట్ కమిటి ఛైర్మెన్ వయ్యాల కృష్ణారెడ్డి,పట్టణ అధ్యక్షుడు పగడాల రాజు తదితరులు పాల్గొన్నారు.

## లోబావి కాలనీ దాహార్తి తీరింది.

శ్రీకాళహస్తి,జూలై 8 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో ప్రజా సమస్యల పరిష్కారంలో తెలుగుదేశం నాయకత్వం అధికారులను పరుగులు తీయిస్తుంది. ఎన్నికల ప్రచారంలో వార్డుల్లో వెల్లిన దేశం అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి మాతృమూర్తి, ఆయన సతీమణికి ప్రజలు ఎన్నో సమస్యలను మొరబెట్టుకున్నారు. లోబావిలో బిసి కాలనీలో ప్రజలు ఎంతో కాలంగా తాము మంచినీటి సమస్యతో సతమతమౌతున్నామన్నారు.ఎన్నికల సమయంలో ఎంఎల్ఏ సతీమణి రిషితారెడ్డి కమిషనర్ రమేష్‌బాబుతో చర్చించారు. ఇక్కడ ఇంటింటికి కోళాయిని మంజూరు చేయించారు.నీటిని సరఫరా చేయటానికి ప్రత్యేక మోటార్‌ను ఏర్పాటు చేసారు. కార్యక్రమాల్లో రిషితారెడ్డితో పాటు కమిషనర్ రమేష్‌బాబు, పట్టణ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు,శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ ఛైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు,కాసరం రమేష్, వార్డు నాయకుడు అద్దంకి కిట్టు,మహిళా నాయకురాలు సునీత,చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## 17న సన్మాన మహోత్సవాన్ని జయప్రదం చేయండి

కురవ కురుమ కురవ సంఘం పిలుపు

తిరుపతి హెల్త్, జూలై 8, ప్రభాతవార్త



నూతనంగా పాలనలో కొచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులకు సన్మాన కార్యక్రమాన్ని ఈనెల 17వ తేదీ స్థానిక ఓల్డ్ తిరుచానూరు రోడ్డులోని ఎస్సార్ కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తమ కులస్తులంతా ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కురువ కురుమ కురవ సంఘం అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు పిలుపునిచ్చారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో సోమవారం మీడియా ముందు ఆయన మాట్లాడుతూ తమ కులానికి చెందిన వారికి ఎంపి, ఎమ్మెల్యేలుగా అవకాశం ఇచ్చినందుకు సిఎం చంద్రబాబు, ఉప సిఎం పవన్ కళ్యాణ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో రెడ్డి కుమార్, మంగిరి రెడ్డప్ప, గుండ్లూరు శ్రీనివాసులు, రుయామల్లి తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి

రిటైర్డ్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు పిఎస్ఎస్ఎన్‌పి శాస్త్రి

తిరుపతి హెల్త్, జులై 8, ప్రభాతవార్త



నూతన ప్రభుత్వ సహకారంతో విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని రిటైర్డ్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు పిఎస్ఎస్ఎన్‌పి శాస్త్రి పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి సంఘం కార్యవర్గ సమావేశం స్థానిక ఎల్ఐసి రోడ్‌లోని ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించారు. రావాల్సిన బకాయిల విషయంలో సంఘం పోరాడుతుందన్నారు. ప్రభుత్వానికి తెలియచేయాల్సిన డిమాండ్ల గురించి సమావేశంలో చర్చించారు. ఇప్పటి వరకు బకాయిలు ఉన్న డిఆర్‌లు మొత్తం చెల్లించేలాగా, పన్నెండవ పిఆర్సి అమలు కావడానికి ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున ఐఆర్ ఇంటీరియం రిలీఫ్ ప్రకటించాలని కోరారు. అనంతరం రాష్ట్ర సంఘం జనరల్ సెక్రటరీ ఎల్. లక్ష్మీనారాయణ, కోశాధికారి పి. నాగరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్లు పలువురు మాట్లాడారు. తిరుపతి జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం కెఆర్ శంకర్, కోశాధికారి టి. సిద్ధయ్య, తిరుపతి నగర శాఖ కార్యదర్శి సి. వెంకటేశం శెట్టి, టి. గోపాల్, పలువురు కార్యవర్గ సభ్యులు రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులను కార్యదర్శులను కార్యవర్గ సభ్యులను శాలువా పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్లు ఆర్. రామ్మూర్తి, కెఎస్ హనుమంతరావు, వి. గురు రాజారావు, జె జేమ్స్, టి. జయరామనాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, కార్యవర్గ సభ్యులు, తిరుపతి జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కేఆర్ శంకర్, కార్యదర్శి టి. సిద్ధయ్య, కోశాధికారి మునికృష్ణ, జాయింట్ సెక్రటరీలు గోపాల్, రమణప్ప, టి. రమణ, జయలక్ష్మి, నవనీతమ్మ పలువురు జిల్లాలోని విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

## రుయాలో నర్సింగ్ స్టాఫ్‌పై దాడికి నిరసన

చంద్రగిరి, జూలై 8 ప్రభాతవార్త:



తిరుపతి రుయా ఆసుపత్రిలో నర్సింగ్ స్టాఫ్‌పై దాడిని ఖండిస్తూ సోమవారం చంద్రగిరి ప్రభుత్వ ఏరియా (కమ్యూనిటీ హెల్త్ సెంటర్) ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిరుపతి రుయా ఆసుపత్రిలో నర్సింగ్ స్టాఫ్‌ను ఓ వ్యక్తి బలమైన ఇనుపరాడ్‌తో దాడిచేసి తలపై తీవ్రంగా గాయపరిచినట్లు తెలిపారు. తీవ్రగాయంతో రక్తస్రావమైన బాధితురాలు అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బందిపై ఇటువంటి భౌతికదాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రైలు కిందపడి గుర్తు తెలియని మహిళ మృతి

చంద్రగిరి, జూలై 8 ప్రభాతవార్త:



రైలు క్రిందపడి గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన నరశింగాపురం రైల్వే గేటు సమీపంలో సోమవారం చోటు చేసుకున్నది. సమాచారం అందుకున్న పాకాల పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని శవపంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధిత మహిళ ప్రమాదవశాత్తు మరణించినదా, ఆత్మహత్యకు పాల్పడినదా పోలీసు విచారణలో తేలాల్సి వున్నది.

## చిరస్మరణీయుడు వైఎస్ఆర్

తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి, జూలై 8 ప్రభాతవార్త:



యావత్ జాతి గర్వించేరీతిన సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన చిరస్మరణీయుడు దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికొనియాడారు. స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం వైఎస్ఆర్ 75వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, జడ్పీటిసి చిల్లకూరి యుగంధర్ రెడ్డి, ఎంపిటిసిలు బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, మాదవరెడ్డి, ఉప సర్పంచ్ నగిరి చంద్రశేఖర్ రెడ్డి, రాయలపురం సర్పంచ్ వెంకటయ్య, నాయకులు యారాశి చంద్రశేఖర్ రెడ్డి, పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, బండారు సుధాకర్, మించల ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల ఆధ్యుడు వైఎస్ఆర్

తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

రామచంద్రాపురం, జూలై 8 ప్రభాతవార్త:



దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సంక్షేమ పథకాల ఆధ్యుడని తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కొనియాడారు. తిరుచానూరు మార్కెటింగ్ కమిటీ వైస్ ఛైర్మన్ గిరిధర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నెన్నూరులో వైఎస్ఆర్ 75వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి ఏవి బ్రహ్మానందరెడ్డి, వైస్ ఎంపిపి లావణ్య చినబాబు, నాయకులు యోగానందరెడ్డి, సాయిశశికాంత్, సిద్దారెడ్డి,ఓబుల్ రెడ్డి, జ్యోతి, మునీంద్ర యాదవ్, గోపి చౌదరి, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌కు ఘన నివాళి

తిరుపతిరూరల్, జూలై 8 ప్రభాతవార్త:



వైయస్.రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలు సోమవారం తిరుపతిరూరల్ మండలంలో ఘనంగా నిర్వహించారు. తుడ మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆయా గ్రామ పంచాయతిలలో పర్యటించిన ఘనంగా నివాళ్ళు అర్పించారు. పద్మావతిపురంలో రాజన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్ళు అర్పించారు. లింగేశ్వర్ నగర్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పేరూరులో, పెరుమాళ్ళపల్లి, తనపల్లి, అవిలాల, సి,గొల్లపల్లి తదితర గ్రామ పంచాయతిలలో రాజన్నకు పార్టీ నాయకులు, అభిమానులు నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప మండలాధ్యక్షుడు విడుదల మాధవరెడ్డి, పద్మావతిపురం మహేశ్వరరెడ్డి, సాయిరాయల్, మూలంచంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సత్యవేడులో వైఎస్ఆర్ జయంతి వేడుకలు

సత్యవేడు, జూలై 8 ప్రభాతవార్త:



దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద ఇన్‌చార్జి నూకతోటి రాజేష్ నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుశీల్‌కుమార్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, రమేష్ రాయల్, యుగంధర్, మోహన్‌రెడ్డి, రవిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఎంపీ రవి, గోవిందస్వామి, కనకరాజ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు

విజయపురం, జూలై 8 ప్రభాతవార్త:



మండలంలోని పన్నూరు, సబ్‌స్టేషన్, మాధవరంలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, ఎంపీటీసీ రాజగోపాల్, నాయకులు బాబు, విజయన్, గుణశేఖర్‌రెడ్డి, శ్రీరాములురెడ్డి, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాభివృద్ధికి సిఎం చంద్రబాబు విశాలమైన ఆలోచన

**- చిత్తూరు ఎం.పి. దగ్గుమళ్ల ప్రసాద్‌రావు**
**- ప్రజా సమస్యల పరిష్కారంకై చిత్తూరులో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు!!**

కుప్పం, జూలై 8 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు రాష్ట్ర అభివృద్ధికి విశాలమైన ఆలోచనలు చేస్తున్నారని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ల ప్రసాద్ రావు పేర్కొన్నారు. సోమవారం కుప్పం తెదేపా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌తో కలసి మాట్లాడారు. ఇటీవలే ఢిల్లీలో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర ఆర్థికస్థితిగతులను కేంద్రం పెద్దలకు పూర్తిస్థాయిలో వివరించారన్నారు. రాష్ట్రాభివృద్ధికి తగిన ఆర్థికసాయం చేయాలని కోరడం జరిగిందన్నారు. పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర వాటాగా మ్యాచింగ్ గ్రాంట్ లేకుండానే నిధులు విడుదల చేయాలని సిఎం కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. చిత్తూరు జిల్లాలో నెలకొన్న సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందిస్తున్నారన్నారు. కేంద్రంలో అమలయ్యే పలు పథకాల్లో జిల్లా ప్రజలకు లబ్ది కలిగేలా చూస్తామన్నారు. ఎంపి లా ్యడ్స్‌తో పాటు కేంద్రం నుంచి వచ్చే నిధులను జిల్లా అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన



హామీల అమలుకు కష్టపడి పనిచేస్తానని పేర్కొన్నారు. త్వరలోనే జిల్లాలోని మండలాల వారీగా ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటా మన్నారు. జిల్లా కేంద్రమైన చిత్తూరులో ప్రజల సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేశామని ప్రజలు తమ సమస్యలను ఈ కేంద్రంలో తెలియజేస్తే వాటి పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. తనకు కుప్పంలో మంచి మెజార్టీ రావడం పట్ల కుప్పం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్,మాజీ ఎంపిపి డా॥వెంకటేష్, నేతలు సత్యేంద్రశేఖర్, ప్రతాప్‌లు పాల్గొన్నారు.

## ఘోష్ ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని మంత్రికి వినతి

వెంకటగిరి, జులై 8 ప్రభాతవవార్త: ప్రభుత్వ ఘోష్ ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ విద్యా శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ని ఏపి ప్రజా సంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దల మునెయ్య కలిసి వినతి పత్రం అందజేశారు. మంత్రి సత్యకుమార్ యాదవ్‌కి వెంకటగిరి నియోజకవర్గంలోని ప్రజల యొక్క వైద్య ఆరోగ్య సమస్యలపై వివరించారు. ముఖ్యంగా నియోజకవర్గ పరిధిలో చాలా మంది కిడ్నీ డయాలసిస్ సమస్యతో బాధపడుతున్నారు. డయాలసిస్ సెంటర్ స్థానికంగా లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సి న పరిస్థితి ఉంది. అందువలన వెంకటగిరి పట్టణంలో కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణంలో ఘోష్ ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని అదే విధంగా వంద పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టి అన్ని రకాల ఆధునిక వైద్య కల్పించాలని కోరారు. స్పందించిన మంత్రి తొందర్లో వెంకటగిరి నియోజకవర్గంలో వైద్య సదుపాయాల పైన పర్యటన చేస్తానని తెలియజేశారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక నియోజకవర్గ కన్వీనర్ ఎస్‌కె రఫీ తదితరులు పాల్గొన్నారు



## జాతీయ సంస్కృత వర్సిటీలో బ్రిడ్జ్ కోర్సులు ప్రారంభం

తిరుపతి విద్య, జులై 8 ప్రభాతవార్త



తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఆచార్య (పిజి) కోర్సుల్లో నూతనంగా ప్రవేశం పొందినటువంటి విద్యార్థులకు విశ్వవిద్యాలయంలో బోధించేటువంటి 15 పైగా వివిధ శాస్త్రాల ప్రాథమిక పరిచయాన్ని విద్యార్థులకు తెలియజేయడానికి బ్రిడ్జ్ కోర్సులు ప్రారంభించినట్లు వీసీ కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నూతన విద్యార్థులు వారికి సంస్కృత విశ్వవిద్యాలయంలో బోధించేటువంటి 15 పైగా శాస్త్రాలు, వాటిలో ఉన్నటువంటి అంశాలను ప్రాథమిక పరిచయంగా ఈ బ్రిడ్జి కోర్సులు ఉపయోగ పడతాయని తెలిపారు. కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సి. రంగనాథన్ మాట్లాడుతూ జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో శాస్త్ర అధ్యయన అధ్యాపనంలో అగ్రగామిగా ఉండటం వల్లే ఎంతో మంది విద్యార్థులు ఇక్కడికి వచ్చి శాస్త్రాధ్యయనం చేస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సచివాలయం పై అసాంఘిక కార్యకలాపాలు

**టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి మన్నూరు సుగుణమ్మకు ప్రజలు వినతి**



తిరుపతి కార్పొరేషన్, జులై 8 ప్రభాతవార్త : తిరుపతిలోని 37వ డివిజన్ సచివాలయం పై ఉన్న హాల్‌లో చాలా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుందని తిరుపతి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి మన్నూరు సుగుణమ్మ దృష్టికి తీసుకు వచ్చారు. అక్కడ జరుగుతున్నటువంటి కార్యకలా పాలు అన్నిటిని ఆయా శాఖల అధికారులతో సుగణ మ్మ ముఖ్యంగా సిసి కెమెరాలు, సచివాల యంనకు వాచ్ మెన్ నియమించాలని కోరారు. సచివాలయంలో ఉన్న బోరు పనిచేయడం లేది అక్కడ ఉన్న స్కూల్‌కు నీటి సరపర లేక చదువుతున్న పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారు. నైట్ షెల్టర్ ఉన్న గదులనందు పై కప్పు వర్షం పడినప్పుడు నీరు కారుతున్నదని చెప్పారు. వాళ్ళు స్పందించి త్వరలోనే చెప్పారు. నగర పార్టీ అధ్యక్షులు, 37వ వార్డ్ ప్రెసిడెంట్, ప్రధాన కార్యదర్శి, యూనిట్ ఇంచార్జి, వర్డ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## లార్వా పెరగకుండా అన్ని చర్యలు చేపట్టాలి:కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, జులై 8 ప్రభాతవార్త : డెంగీ, డయేరియా కేసులు పెరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా లార్వా పెరగకుండా మందులు పిచికారి చేయించాలని, కాలువల్లో బ్లీచింగ్ చల్లించాలని, నీరు నిల్వ వుండకుండా పరిశీలించాలని, డ్రైన్లు అన్ని సాఫీగా ప్రవహించేలా అన్ని చర్యలు తీసుకోవాలని శానిటేషన్, ఇంజనీరింగ్ అధికారులనుద్దేశించి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అతిథి సింగ్ ఆదేశాలు జారీ చేసారు. ఇటీవల డెంగీ పాజిటివ్ వచ్చిన ఐఎస్ మహల్ ప్రాంతంలోని ఇంటి పరిసరాలను, అదే విధంగా నెహ్రూ నగర్, బొమ్మగుంట ప్రాంతాలను సోమవారం సాయంత్రం కమిషనర్ అధితి సింగ్ పరిశీలించారు. ఏఎన్ఎంలు, హెల్త్ వర్కర్లు, హెల్త్ సెక్రటరీలు, అమ్మెటి సెక్రటరీలు, శానిటేషన్ సెక్రటరీలు, శానిటేషన్ సిబ్బంది అందరు సమన్వయం చేసుకుంటూ చాలా జాగ్రత్తగా నిరంతరం వార్డులను, ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని, ముఖ్యంగా ఎక్కడైన డ్రైనేజి నీరు ప్రవహించని స్థలాలను గుర్తించి అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఇండ్ల ముందర పాడైన కూలర్లు, ప్లాస్టిక్ జకెట్లు, కుండీల్లో నీరు నిల్వ వుండకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని కొంత మంది ప్రజలకు ఈ సందర్భంగా కమిషనర్ స్వయంగా తెలియజేసారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిఈ తెజస్వీ, శానిటరీ సూపర్‌వైజర్ చెంచెయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

## పాసుపుస్తకాలను సకాలంలో మంజూరు చేయాలి

గూడూరు, జులై 8 ప్రభాతవార్త : గూడూరు సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ గూడూరు మండలంలోని రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు సకాలంలో మంజూరు చేయాలని గూడూరు సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ ఆవరణంలో ప్రజా విజ్ఞప్తుల దినంను నిర్వహించారు. ఈ కార్యమ్రానికి ముఖ్య అతిథిగా గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పాల్గొన్నారు. గూడూరు సిపిఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జోగి శివకుమార్ మాట్లాడుతూ రైతులు మీ సేవా ద్వారా పట్టాదారు పాసుపుస్తకాలును మీ సేవా ద్వారా అప్లై చేసుకొని , నాలుగు నెలలు గడుస్తున్నా ఇంత వరకు రైతులకు మంజూరు చేయకపోవడంలో అంతర్యం ఏమిటని రెవెన్యూ అధికారులు త్వరితగతిన పరిశీలించి సకాలంలో పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఈయన వెంట సిఐటియు పట్టణ కార్యదర్శి సురేష్, ఆటో యూనియన్ నాయకులు బివి రమణయ్య, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు : ఎమ్మెల్యే

గూడూరు, జులై 8, ప్రభాతవార్త : ప్రజల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శించవద్దని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అధికారులకు సూచించారు. గూడూరు పట్టణంలోని గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ గూడూరు ఆర్డిఓ కిరణ్ కుమార్, వివిధ శాఖల అధికారులు ప్రజా విజ్ఞప్తుల దినం కార్యక్రమం నిర్వహించారు. గూడూరు నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల నుండి ప్రజలు వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజ్ఞప్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ విజ్ఞప్తులను తీసుకొని వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తుందని అధికారులు కూడా ప్రజల సమస్యల పరిష్కారానికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వర్లుతో పాటు ప్రముఖ పారిశ్రామికవేత్త తానంకి నానాజీ మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, కొండూరు వెంకటేశ్వరరాజు గుండాల లీలావతి, గుండాల భారతి, శ్రీకిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పెద్దాయి ప్రవీణ్ కుమార్ రెడ్డి, పూడిపర్తి ప్రవీణ్ కుమార్ రెడ్డి, మరి కొంత మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిత్యకళ్యాణం పచ్చతోరణం...భక్తుల సంబరం



శ్రీకాళహస్తి, జూలై 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తులతో కిట కిట లాడింది. ఆలయం నిత్యకళ్యాణం పచ్చతోరణంలా మారింది. ఉదయం నుంచి భక్తుల సంబరం కనబడింది. ఉదయం నుంచి ఆలయంలో స్వామి అమ్మవార్లకు అభిషేకాలతో పునీతం కాగా,రాహుకేతుదోష నివారణ పూజలతో ఉపశమనం కల్గింది. ఆలయానికి వచ్చిన భక్తులకు సుదర్శనం కోసం కొత్తగా అదనపు బాధ్యతలు స్వీకరించిన ఇఓ మూర్తి సిబ్బందిని పరుగులు తీయించారు. ఆలయాధికారులు అందించిన సమాచారంమేరకు స్వామి అమ్మవార్లకు అభిషేకాలు 139 జరిగాయి.సాయంత్రం మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 46 జరిగినట్లు వివరించారు. రాహుకేతు దోష నివారణ పూజలు 5వేలు జరిగాయి. ప్రత్యేక దర్శనం టిక్కెట్లు 4వేలు జరిగాయి.

**మృత్యుంజయునికి షోఢషాభిషేకాలు:**

మృత్యుంజయస్వామికి షోడషాభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో మృత్యుంజయ లింగానికి విశేష ప్రాధాన్యత ఉంది. కష్ట కాలంలోనూ, కరువు కరాళ నృత్యం చేస్తున్న సమయంలోనూ మృత్యుంజయ స్వామికి విశేష పూజలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో శివయ్యకు ప్రీతి పాత్రమైన రోజు కాబట్టి దూర ప్రాంతాలు పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు అభిషేకాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు.దాంతో శివయ్యకు విశేష సంఖ్యలో అభిషేకాలు నిర్వహించారు.కాగా ఆలయంలో నిత్యకళ్యాణం పచ్చ తోరణంలా పూజలు అభిషేకాలు నిర్వహించబడుతుంది. ఓ వైపు స్వామి అమ్మవార్లకు అభిషేకాలతో పాటు రాహుకేతుదోష నివారణ పూజలు, శనీశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు, ఇక స్వామి అమ్మవార్లకు నిత్యకళ్యాణం,మృత్యుంజయస్వామికి అభిషేకాలతో పునీతమౌతుంది.

# కొడుకు భూమిలో తండ్రి పాగా!

**-రెవెన్యూ అధికారుల చుట్టూ బాధితుల ప్రదక్షిణలు**
**-అన్ని అర్హతలున్నా చోద్యం చూస్తున్న అధికారులు**

చిట్టమూరు, జూలై 8 ప్రభాతవార్త: సహజంగా పేదల భూములతో పాటు బలహీనంగా ఉండే కొంతమంది భూములు ఆక్రమణకు గురికావడం చూస్తుంటాం. కానీ పేగు తెంచుకొని పుట్టిన కన్నకొడుకు భూమినే కబ్జా చేసి వారిని ముప్పుతిప్పలు పెడుతున్న సంఘటనలు చాలా అరుదనే చెప్పాలి. కన్న కొడుకు భూమిలో పాగా వేసిన తండ్రికి రెవెన్యూ అధికారుల అండ దొరకడంతో బాధితులు తమ భూమిని కాపాడాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా కనికరం చూపడం లేదని సోమవారం బాధితులు రెవెన్యూ కార్యాలయం ముందు 'ప్రభాతవార్త'తో తమ ఆవేదన పంచుకున్నారు. బాధితుల కథనం మేరకు, చిట్టమూరు మండలం మెట్టు గ్రామానికి చెందిన వేలూరు సునీల్‌రెడ్డికి తన తండ్రి వేలూరు గోపాల్‌రెడ్డి 1982లో తనకు వారసత్వంగా వచ్చిన 5 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయగా, 2004లో అప్పటి రెవెన్యూ అధికారులు సైతం సునీల్‌రెడ్డి పేరు మీద పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరు చేసి ఉన్నారు. అయితే గత 15 సంవత్సరాల నుంచి సునీల్‌రెడ్డి కన్నీరుమున్నీరవుతున్నారు.



తన భార్య అనుపమ, పిల్లలతో కలిసి కోట మండలం విద్యానగర్‌లో నివాసముంటూ పిల్లలను చదివించుకుంటున్నారు.

సునీల్‌రెడ్డికి చెందిన భూమిని తండ్రే కౌలుకు చేస్తూ ప్రతి సంవత్సరం కౌలును చెల్లిస్తున్నాడు. తన కుటుంబ అవసరాల కోసం తనకు రెవెన్యూ అధికారులు మంజూరు చేసిన భూమిలోనే కొంత భూమిని సునీల్‌రెడ్డిని గత రెండేళ్ల క్రితం విక్రయించి ఉన్నారు. ప్రస్తుతం తన కుమారుల ఉన్నత చదువుల కోసం బ్యాంకు రుణం కోసం అవసరమైన 1బిలో తహశీల్దార్ డిజిటల్ సంతకం రాకపోవడంతో అప్పటి నుంచి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతూ తనకున్న ఒరిజినల్ పట్టాదారు పాస్‌పుస్తకం, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు చూపినప్పటికీ అధికారులు పెడచెవిన పెట్టినట్లు బాధితులు

## శిథిలావస్థలో దామలచెరువు రోడ్ బ్రిడ్జ

**గత ఐదేళ్లుగా మరమ్మతులకు సైతం నోచుకోని పరిస్థితి**



పాకాల, జులై 8 ప్రభాతవార్త : పాకాల మండలం దామలచెరువు గ్రామం మధ్యలో వంక పై ఉన్న రోడ్డు బ్రిడ్జి శిథిలావస్థలోకి చేరింది. నిత్యం ఈ బ్రిడ్జి పై బరువైన వాహనాలు ప్రయాణిస్తూ ఉండడం ఇది కాక వేరే ప్రత్యాయమైన మార్గం లేకపోవడం బ్రిడ్జి పై వాహన రద్దీ ఎక్కువగా ఉండటం బ్రిడ్జి కింద భాగంలో పెద్ద ఎత్తున సిమెంట్ పిల్లలు ఊడిపోయి పైకి కమ్ములు తేలి వంతెన పై వాహన రాకపోకలకు పెను ప్రమాదం పొంచి ఉంది. దీనిపై ఉన్నతాధికారులు వెంటనే దృష్టి సారించి బ్రిడ్జికి మరమ్మత్తులు చేసి పటిష్ట పరచవల్సిందిగా వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

## కాణిపాకం ఆలయానికి 1.32 కోట్లు ఆదాయం



కాణిపాకం, జూలై 8 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 1.32 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. సోమవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఈఓ వెంకటేశు ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈసందర్భంగా 19 రోజులకు గాను హుండీల ద్వారా 1,32,32,171 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 92 గ్రాముల బంగారు, ఒక కిలో 160 గ్రాముల గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 11,586 రూపాయలు ఆదాయంగా వచ్చింది. నిత్యాన్నదాన హుండీ ద్వారా 32,231 రూపాయలు ఆదాయంగా లభించింది. దీనితో పాటు 1431 అమెరికా డాలర్లు, 1016 మలేషియా రింగిట్స్, 20 ఆస్ట్రేలియా డాలర్లు, 17 సింగపూర్ డాలర్లు,ఐదు కెనడా డాలర్లు, 10 యూరో కరెన్సీ, 605 యూఏఈ దినార్స్ ఆదాయంగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఏఈఓలు రవీంద్రబాబు, ఎస్వీ.కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, ధనుంజయ సూపరెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, బాలరంగస్వామి, మల్లిఖార్జున, హుండీ ఇన్స్‌పెక్టర్ సుబ్రమణ్యంనాయుడు, కాణిపాకం యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బోయకొండ ఇఓగా ఏకాంబరం బాధ్యతలు స్వీకరణ



బోయకొండ(చౌడేపల్లి), జూలై 8 ప్రభాతవార్త : శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయ ఇఓగా ఏకాంబరం నియమితులయ్యారు. సోమవారం ఈ మేరకు పరిపాలనా భవనంలో చంద్రమౌళి నుంచి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఇరువురు అమ్మవారిని దర్శించుకొన్నారు. అనంతరం అధికారులు ఏకాంబరం, చంద్రమౌళినను ఘనంగా సన్మానించారు.

## జాప్యం లేకుండా ఫిర్యాదుల పరిష్కారం : ఎస్పీ



చిత్తూరు టౌన్, జులై 8 ప్రభాతవార్త: ప్రజల నుండి అందిన ఫిర్యాదులను జాప్యం లేకుండా ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని ఎస్పీ మణికంఠ చందోలు పోలీసు అధికారులను ఆదేశించారు. చిత్తూరు పాత డిపిఓ కార్యాలయంలో సోమవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం కార్యక్రమంలో ఎస్పీ మణికంఠ చందోలు, అడ్మిన్ ఎఎస్పీ ఆరీఫుల్లాలు పాల్గొని ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ క్యాక్రమానికి జిల్లా నలుమూలల నుండి 39 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో దిశా డిఎస్పీ సుధాకర్‌రెడ్డి పాల్గొని ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు.

## అంబులెన్స్‌కు లైన్ క్లియర్

**- చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి రోగులు వెళ్లడానికి అక్రమణలు తొలగింపు**



చిత్తూరు టౌన్, జులై 8 ప్రభాతవార్త: అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం ఎవరినైనా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళాలంటే కుదరని పని అని అంబులెన్స్ డ్రైవర్లే స్పష్టం చేసేవారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి నగరంలో ఓ చివరన వుండటం అక్కడికి అంబులెన్స్ వెళ్ళాలంటే ట్రాఫిక్ అధికంగా వుంటే మార్కెట్, బజారువీధి, చర్చివీధుల గుండా వెళ్ళాల్సి వుండటంతో కష్టమయ్యేది. అయితే ప్రస్తుతం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి అత్యవసరంగా వైద్యం కోసం అంబులెన్స్ వెళ్ళడానికి మార్గంను క్లియర్ చేశారు. ఇటీవల చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించడానికి వచ్చిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ఆసుపత్రికి వెళ్ళడానికి చర్చివీధిలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ఆదేశాల మేరకు సోమవారం రంగంలోకి దిగిన ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు, మన్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణల పర్యవేక్షణలో పోలీసులు, మున్సిపల్ సిబ్బంది చర్చివీధి, బజారువీది, పండ్ల వీధుల్లో ఆక్రమణలు, అడ్డంకులను తొలగించారు. ఫుట్‌పాత్‌లను క్లియర్ చేసి వాహనాల పార్కింగ్ ప్రక్రియను క్రమబద్దీకరించారు. ఫలితంగా ప్రస్తుతం చర్చివీధి, పండ్ల మార్కెట్ వీధుల్లో వాహనాల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా మార్గం సులభం అయ్యింది. ఆసుపత్రిలో అంబులెన్స్ వెళ్ళడానికి రహదారిని క్లియర్ చేయడంతో అందరిలో హర్షం వ్యక్తం అవుతుంది.

## ప్రారంభానికి ముస్తాబవుతున్న రైతు సేవా కేంద్రం



చిట్టమూరు, జూలై 8 ప్రభాతవార్త : చిట్టమూరులో నూతనంగా నిర్మించిన రైతు సేవా కేంద్రం ప్రారంభానికి అన్ని విధాలుగా రూపుదిద్దుకుంటోంది. చిట్టమూరు మండల కార్యాలయం పక్కన గత ప్రభుత్వంలో నిర్మించి పూర్తి చేసిన రైతు భరోసా కేంద్రాలను ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం రైతు సేవా కేంద్రంగా మార్చిన విషయం తెలిసిందే. దీంతో ఈ నెల 10వ తేదీన గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ చేతులు మీదుగా ఈ భవనాన్ని ప్రారంభించడంతో పాటు తహశీల్దార్ కార్యాలయం ముందు ఎన్టీఆర్ విగ్రహానికి భూమిపూజ కూడా నిర్వహించేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు కసరత్తు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మండల పరిషత్ కార్యాలయం అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని ఇఓపిఆర్‌డి మనోహర్ గౌడ్ తెలిపారు.

## ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి:ఎమ్మెల్యే

పెద్దపంజాణి,జూలై 8,ప్రభాతవార్త: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రతి ఒక్కరు పని చేయాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి నాయకులకు సూచించారు.మండలంలోని కెలవాతి గ్రామంలో ఆయన నివాసం నందు నాయకులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మనపై ఎంతో నమ్మకం,విశ్వాంతో మంచి విజయాన్ని అందించారన్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన విధంగా కక్షపూరిత రాజకీయాలకు తావు లేని విధంగా పని చేస్తూ పార్టీలకు అతీతంగా పేదలకు మంచి చేసేలా నాయకులు హుందా రాజకీయాలు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి విజయభాస్కర్ రెడ్డి,మండల అధ్యక్షులు ఆనంద్,ప్రధాన కార్యదర్శి చలపతి,నాయకులు చెంగారెడ్డి,సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వి.కోటలో ఘనంగా వైఎస్ఆర్ జయంతి ఉత్సవం



వి.కోట,జూలై 8 ప్రభాతవార్త: వి.కోట మండల కేంద్రంలో ఘనంగా దివంగత నేత డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి మాజీ ఎమ్మెల్యే డా.వెంకటే గౌడా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.స్థానిక వైఎస్ఆర్ కూడలిలో వైకాపా శ్రేణులు డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యువరాజు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం-విఐపి బ్రేక్ రద్దు



తిరుమల, జులై 8 ప్రభాతవార్త : వేంకటేశ్వరస్వామికి ఈనెల 16వతేదీ ఆణివార ఆస్థానం జరగనుం డటంతో (నేడు)మంగళవారం ఉదయం ఆలయ శుద్ధి నిర్వహిస్తున్నారు. ఉదయం 5గంటల నుంచి 10గంటల వరకు పరమపవిత్రంగా, ఒక యజ్ఞంలా నిర్వహిస్తారు. ఆలయంలోపల ఆనందనిలయం నుంచి బంగారువాకిలి, వెండివాకిలి, మహద్వారం వరకు ఆలయంలోపల ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం పూజాసామాగ్రి తదితర వస్తువులను సుగంధద్రవ్యాలు నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గంధంపొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర వాటితో కలగలిపిన నీటితో శుద్ధిచేస్తారు. ఆ సమయంలో స్వామివారి మూలవిరాట్టును శ్వేత వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచుతారు. ఏడాదిలో నాలుగుదఫాలుగా కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం చేపడతారు. ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, ఉగాది ఆస్థానం, వైకుంఠ ఏకాదశి ముందు మంగళవారాలు ఆలయ శుద్ధి జరుగుతుంది. నేడు అష్టదళపాదపద్మారాధన సేవరద్దుచేశారు.

## కావమ్మ, మారయ్య ఆలయానికి వెండి కిరీటాలు బహూకరణ



శ్రీకాళహస్తి, జూలై 8 ప్రభాతవార్త: పట్టణంలోని గాంధీవీధిలో వెలసిన కావమ్మ మందిరంలో కావమ్మ మారయ్యల తిరునాళ్ళు ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండోరోజు సారె సందర్భంగా కావమ్మగుడివీధి వాస్తవ్యులు కాట్రపల్లిగోపి, రాజేశ్వరిలు కావమ్మ, మారయ్యల విగ్రహాలకు వెండి కిరీటాలు ఆలయ నిర్వాహకులకు నెల్లూరు రవికుమార్ నెల్లూరు జగదీష్, నెల్లూరు కన్నయ్యలకు అందించారు. తిరుపతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప, సతీమణి కళ్యాణిలు విచ్చేసి కావమ్మ మారయ్యలను దర్శించుకుని స్వామిఅమ్మవార్ల తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గాంధీ, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మహా ప్రస్థానం వాహనం ప్రారంభం



పుత్తూరు, జూలై 8 ప్రభాతవార్త : స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మనోహరరాజు ట్రస్ట్ తరపున వేదవ్యాస విద్యా సంస్థల యాజమాన్యం ఏర్పాటు చేసిన మహా ప్రస్థానం వాహనాన్ని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వాస్పత్రిలో ఎవరైనా మరణించినా లేదా పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహా లను వారి ఇండ్లకు తీసుకెళ్లేందుకు వాహనానికి సుమారు రూ. 10,000 వేలు ఖర్చవుతోంది. పేదలకు ఈ ఖర్చు భారంగా పరిణమించింది. దాంతో వేదవ్యాస్ విద్యా సంస్థల యాజమాన్యం మానవతా దృక్పథంతో మహాప్రస్థానం పేరిట మృతదేహాలను బాధితుల ఇళ్లకు చేర్చేందుకు ఉచితంగా వాహనాన్ని సమకూర్చింది. దీనిని ప్రారంభించిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేదవ్యాస విద్యా సంస్థల తరపున మహాప్రస్థానం వాహనం ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. పుత్తూరు ఆస్పత్రిలో పిల్లల వైద్యులు లేరని తన దృష్టికి వచ్చిందని, త్వరలోనే ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు, సిబ్బంది నియామకాలు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేస్తోందన్నారు. ఇప్పటికే ఎన్నికల హామీలైన మెగా డిఎస్సీ ప్రకటించామని, త్వరలోనే ఉచిత ఇసుక ఇస్తామని తెలిపారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా స్వయంగా నాయకులే వృద్ధులు, వికలాంగుల ఇళ్లకు వెళ్లి పెంచిన పెన్షన్ సొమ్ము అందించామని తెలిపారు. అనంతరం పట్టణంలో వేదవ్యాస స్కూలు నూతన బ్రాంచ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, పట్టణ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నం నాయుడు, ఎన్.ఎన్.ధనపాల్, బిసి సంఘం జిల్లా అధ్యక్షుడు సిహెచ్.షణ్ముగరెడ్డి, నాయకులు డి.ఎన్.ఏలుమలై (అమ్ములు), వేదవ్యాస విద్యాసంస్థల యాజమాన్య ప్రతినిధులు బాలసరస్వతి, వేదవ్యాస్, ఎస్వీ యూనివర్శిటీ పాలకమండలి సభ్యులు సి.నారాయణబాబు తదితరులు పాల్గొన్నారు.


**పుత్తూరు పురపాలక సంఘము,పుత్తూరు**

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు**

టెండరు నోటీసు నెం.01/ఇ1/2024-25

పుత్తూరు పురపాలక సంఘము నందు రాష్ట్ర ప్రభుత్వము వారి అన్నా క్యాంటీన్ నిధులు నుండి అన్నా క్యాంటీన్ భవనము నిర్మాణం కొరకు (నిట్ నెం.01/2024-25) రిజిష్టర్డు కాంట్రాక్టర్ నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది.సదరు పనికి సంబంధించిన పూర్తి వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నందు చూడవలెను.

http://tender.apeprocurement.gov.in

కమిషనర్
పుత్తూరు పురపాలక సంఘం